www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025
5
అన్నమయ్య



రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ రాచపల్లికి చెందిన శెట్టిపల్లి ఇందిరమ్మ ఇటీవల మరణించడంతో ఆమెకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉండడంవల్ల ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన బీమా కింద రూ.2 లక్షల మంజూరు మంజూరైంది. మంగళవారం బ్యాంక్ మేనేజర్ మనోహర్ నామిని శెట్టిపల్లి నాగభూషణంకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్య, జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. నిరుపేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబ యజమానులు కన్ను మూసిన సందర్భాల్లో.. ఆ కుటుంబాలకు సామాజిక ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం బీమా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



చెక్ అందజేస్తున్న మేనేజర్

కనీస వేతనాలు అమలు చేయాలి

- కళ్లకు గంతలతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఆప్కాస్ కొంసాగించి ప్రయివేట్ ఏజెన్సీలకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి ప్రజల ఆక్రోషం నుండి కాపాడాలని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లిన పరిష్కారం చేయడం లేదని నాణ్యమైన పనిముట్లు చేతులకు బ్లౌజులు ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు యూనిఫాం లాంటి సౌకర్యాలతో పాటు 36 జిఒ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కమిషనర్ హామీ: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వద్దకు వచ్చినాయన సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని విధులకు హాజరుకావాలని కోరారు. జీతాలు పెంచేంతవరకు విధులకు హాజరు కామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి దేవా, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, వెంకటరమణ, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



రాజంపేట : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు



రాయచోటి : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

రాజంపేట అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం గతంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన 16 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులతో కలిసి పురపాలక కార్యాలయం వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ పథకాలని వర్తింపజేయాలని కోరారు. సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని జీవో విడుదలైనప్పటికీ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పురపాలికలోని వాటర్, ఎలక్ట్రిక్ శాఖల్లోని కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నాన్చుడి ద్వారానే వ్యవహరిస్తోందని అన్నారు. వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, సాలమ్మ, ప్రసాద్, బుజ్జయ్య, రమణ, శంకర్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన ట్రిపుల్‌ఐటి కౌన్సెలింగ్ ప్రక్రియ

- 1010 సీట్లకు గాను 878 మందికి ప్రవేశాలు
- మిగిలిన సీట్లకు త్వరలో రెండవ జాబితా విడుదల

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటిలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు రెండు రోజుల పాటు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయినట్లు డైరెక్టర్ ఎ.వి.ఎస్. కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా 1010 సీట్లకు సంబంధించి అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా 878 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. రెండోవ రోజైన మంగళవారం కూడ విద్యార్థులకు ఎటువంటి అంతరాయాలు లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. పకడ్బందీగా అధికారులు కౌన్సెలింగ్ పక్రియను నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి గ్రామానికి చెందిన అంచెల శ్రీధర్ అనే విద్యార్థి ఇటీవలే ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో క్యాంపస్ లోని గ్రంథాలయం వద్ద ఉండడం గమనించి డైరెక్టర్ స్వయంగా అ విద్యార్థితో మాట్లాడి కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేసి విద్యార్థికి ప్రవేశపత్రాన్ని అందజేశారు. దీంతో ఆ విద్యార్థి తండ్రి శ్రీరాములు డైరెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో రెండవ జాబితా విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్ కైలాష్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, అధ్యాపకులు లింగమూర్తి, జ్ఞాన వెంకట్, అసోసియేట్ డీన్స్ రాఘవరెడ్డి, రఫీ, నవీన్, క్యాంపస్ మెయింటెన్స్ ఇన్‌ఛార్జులు పవన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, దీప్తి, బిన్నీ, కోనప్ప, భాస్కరయ్య, మహేంద్ర, కార్తీక్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పరిశీలన కోసం వేచి ఉన్న విద్యార్థులు

పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగిన జగన్ పాలన : 'గడికోట'



ప్రజలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పాలన అందించారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పాలెంగడ్డ పాపన్న గారిపల్లె దళితవాడలో మాజీ జడ్‌పిటిసి ఉపేంద్రారెడ్డి, సీనియర్ నాయకులు గొర్ల రమేష్‌రెడ్డి, మాజీ ఎంపిపి కలకడ నాగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వాయల్పాటి ఆనంద్ కుమార్‌రెడ్డి, రమణారెడ్డి తదితర నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ఆయన దళిత ప్రజలతో మమేకమై, వారిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి వారి యోగ క్షేమాలను, కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దళిత ప్రజలు మాట్లాడుతూ జగనన్న పాలనలో తమకు నేరుగా ఎవ్వరి సిపారసు లేకుండానే సంక్షేమ పథకాలు అందేవని చెప్పారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి జగనన్న చిత్తశుద్ధితో కృషి చేసి, దళితుల పక్షపాతిగా పేరొందారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి ప్రభుత్వం నుంచి ఏ పథకం అందక డబ్బులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రైతు భరోసా, తదితర పథకాలు అందడం లేదని వాపోయారు. గతంలో చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడి తమను అవమానించారని శ్రీకాంత్ రెడ్డి ఎదుట వారు గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సలు పొంది ఇళ్ల వద్ద విశ్రాంతి పొందుతున్న పాలెంగడ్డ పాపన్న గారిపల్లె దళితవాడలో ఏటా సుబ్బరాయుడు, యేటా చంద్ర అనే వైసిపి కార్యకర్తలును శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు .మాజీ ఎంపిటిసి శివయ్యను పరార్శించి, ఆరోగ్య పరిస్థితుల నడిగి తెలుసుకున్నారు. రోడ్డుప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి కార్యకర్త ప్రసన్న కుమార్‌ను శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్తుతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట రమణ నాయక్, అంచల రామచంద్ర, ఎంపిటిసి భద్రయ్య, నాయకులు కిషోర్ రెడ్డి, జాఫర్, మహేశ్వర, బలరాం, నరసింహారెడ్డి, శంకరయ్య నాయుడు, కోట ఆంజనేయులు నాయుడు, జయ నారాయణరెడ్డి, అనిల్‌కుమార్, బాలు, నాగరాజు, సుదర్శన్, అంజన్ కుమార్, అరవింద్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరపురంలో అక్రమ స్థలాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అక్రమార్కులపై కొరడా

- ఆక్రమిత స్థలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అక్రమార్కులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మదనపల్లె పట్టణం అమ్మ చెరువు మిట్ట సమీపంలోని కోళ్లబైలు పంచాయతీ, వెంకటేశ్వరపురంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో స్పందించిన తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి మంగళవారం ఆర్ఐ బాలస్వామి, విఆర్ఒ సౌజన్య, సర్వేయర్ ప్రణీత్‌లతో విచారణ చేయించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ముగ్గురు అధికారులు వెంకటేశ్వరపురంలోని అక్రమ స్థలాల వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రభుత్వం నిరుపేదలకు పక్కా ఇంటి నిర్మాణం కోసం ఒకటిన్నర సెంటు స్థలం కేటాయిస్తే కొంతమంది ఆ పేదల భూములను తులమో.. ప్రణమో ఇచ్చి రాయించుకొని అందుకు అనుగుణంగా మరికొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపట్టారు. ఇంకొందరు ఇదే అదునుగా భావించి ఖాళీ స్థలాలలో అక్రమంగా పునాదులు వేసి ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో స్పందించిన అధికారులు ప్రతి ఇంటిని సర్వే చేయిస్తామని ఎవరికైతే పట్టాలు ఉన్నాయో వారికి మినహా మిగతా వారికి నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడితే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు జరిగినా ఉపేక్షించేది లేదని ఎంతటి పెద్ద నిర్మాణాలైనా కూల్చేస్తామని తెలిపారు. దీంతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ మేరకు నోటీసులు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు ఆర్ఐ బాలస్వామి తెలిపారు.

నూతన సర్వేయర్‌గా రెడ్డిశేఖర్

ప్రజాశక్తి-పీలేరు

మండల నూతన సర్వేయర్‌గా రెడ్డిశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లిలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా పీలేరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానిక తహశీల్దారు శివ కమార్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టును సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, జిల్లా, మండల రెవెన్యూ అధికారుల సూచనల మేరకు తన విధులను నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

4న ఈడిగపల్లిలో మొహరం వేడుకలు

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని వీరబల్లి పంచాయతీ ఈడిగపల్లిలో మొహరం ఉత్సవాలు 4, 5, 6వ తేదీలలో ఘనంగా నిర్వహిస్తారని మొహరం ట్రస్ట్ పెద్దలు తెలిపారు. మంగళవారం ఈడిగపల్లెలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4న అగ్నిగుండం సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఎద్దుల బండి లాగుడు కార్యక్రమం ఉంటన్నారు. అన్నారు. పూత్తా వాండ్ల పల్లెకు చెందిన సిరిగిరి కుళాయి రెడ్డి కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రాత్రికి నెల్లూరు మాధవి ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు. బ్రాహ్మణ కాక వారిచే కోలాటం, వరంగల్ మహిళల డప్పు వాయిద్యం, బాణాసంచా పేలుస్తూ అంగరంగ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. త్యాగాలకు ప్రతీకగా నిర్వహించుకునే మొహరం వేడుకలకు జిల్లా వాసులేగాక రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు.



డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ బి.రామగిడ్డయ్య, ప్రజాశక్తి సిబ్బంది

రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు అందజేస్తుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం వెంకటరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ డ్రోన్ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డ్రోన్లకు 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని, రైతులు రూ.2 లక్షలు మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు గ్రూప్ ఖాతాను తెరవడం ద్వారా ప్రయోజనాలను పొందవచ్చునని తెలిపారు. బొప్పాయి పంటలో క్షేత్ర పరిశీలన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.హరికృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి పి.సందీప్, గ్రామ వ్యవసాయ అధికారి కరీం, సహజ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

140 ఎకరాల హార్టికల్చర్ సాగుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-గాలివీడు: రైతులు హార్టికల్చర్ కింద 140 ఎకరాల్లో సాగు చేసుకోవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు ఎపిఒ రామచంద్రయ్య పేర్కొన్నారు. మినీ గోకులాల్లో కూడా 55 దరఖాస్తుల అందినట్లు పేర్కొన్నారు. ఆరు నెలల కిందట 44 మినీ గోకులాలు నిర్మాణం పూర్తయిందని, తిరిగి మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి జిల్లా కేంద్రానికి ప్రతిపాదన పంపామని తెలిపారు. అక్కడినుంచి నివేదికలు అందిన వెంటనే వీటి పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

దళితుడిపై దాడి అమానుషం

- కేసు నమోదు చేయని పోలీసులు

- పోలీసుస్టేషన్ వద్ద మాలమహానాడు నాయకుల ధర్నా

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని చింతపర్తి పంచాయతీ కోటపల్లిలో దళిత కుటుంబానికి చెందిన వెంకటరమణ కుమారుడు గురునాథ్‌పై చేసిన దాడి అమానుషం అని మాలమహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన్, జిల్లా అధ్యక్షులు శివయ్య అన్నారు. గత నెల 27వ తేదిన గురునాథ్‌ను ఇదే మండలం బోయపల్లికి చెందిన భార్గవ్, అతని అనుచరులు సుమారు 15మంది కలసి దాడి చేసి కులం పేరుతో దూషించారన్నారు. గురునాథ్‌పై విచక్షణ రహితంగా దాడి చేయడంతో గురునాథ్‌కు ఎడమ చెయి మణికట్టు విరిగిపోవడంతో పాటు ఎడమ చెవితెగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ నాయకుల అండదండలతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దళితుడిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మనోహర్, వెంకటస్వామి, సుధాకర్, నాగార్జున, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజా పరిపాలన అంటే కూటమి ప్రభుత్వానిదే : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మరింత సేవలు అందించే మంచి అవకాశం ఉందని, ఏడాది పాలనలో ఎన్నో విజయాలు సాధించామని రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిలో పాలన అంటే చూపించి, భవిష్యత్తులో మరింత మెరుగైన పాలన కోసం ప్రజల దగ్గరకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం కోసం తొలి అడుగు పూర్తి చేసి ప్రజలలోకి వెళుతున్నామన్నారు. ఏడాదిలో పింఛన్‌ను ఎలా పెంచి అందిస్తున్నామో ప్రజలు చూస్తున్నారని, అలాగే ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం, దీపం పథకం, ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం, రైతు సంక్షేమం, డిఎస్‌సి, పోలీసు నియామకాలు, పారిశ్రామిక అభివృద్ధితో పాటు పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు, రాష్ట్రానికి వచ్చిన అనేక కంపెనీలు ఇలా అన్ని కులాలకు, మతాలకు మంచి చేసిన మంచి ప్రభుత్వం మన ప్రభుత్వం అని ఆయన తెలియజేశారు.

సుగవాసి వ్యాఖ్యలు హాస్యాస్పదం

అవినీతితో నిండి పోయి అవినీతికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారిన వారి మధ్యలో కూర్చొని ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ పై సుగవాసి బాల సుబ్రమణ్యం చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని, ముందు తన పక్కన కూర్చున్న నాయకులతో ప్రమాణం చేయించి మాట్లాడాలని చమర్తి పేర్కొన్నారు. వైసిపిలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం లాంటి వ్యక్తి అవినీతిపై వ్యాఖ్యలు చేస్తుంటే హాస్యాస్పదంగా విమర్శించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కూటమి గాలివీచినా రాజంపేటలో ఆయన ఎందుకు ఓడిపోయారో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. టిడిపిని విమర్శించే నైతిక విలువలు బాలసుబ్రమణ్యం కు లేవని, వైసిపి నాయకులతో కుమ్మక్కు అయిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసని తెలిపారు. ఒకరిని ప్రశ్నించేటపుడు మనం ఎక్కడ ఉన్నామో ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. అందుకే ఏ ఒక్క టిడిపి కార్యకర్త సుగవాసి వెంట రాలేదంటే నీ గుట్టు నాయకులకు, కార్యకర్తలకు అందరికి తెలుసని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, అద్దేపల్లి ప్రతాప్ రాజు, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, పట్టణ టిడిపి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, నందలూరు క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, సిద్ధవటం టిడిపి యువ నాయకులు రాజా నాయుడు, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, మైనార్టీ నాయకులు పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి : ఎన్‌టిఎ

ప్రజాశక్తి-రాయచోటి

ప్లస్ టు పాఠశాలల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు గతంలో అక్కడ పనిచేసిన ఉపాధ్యాయులకే ప్రాధాన్యత ఇవ్వాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. మంగళవారం అయన విజయవాడలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో సబ్జెక్టులకు ఉద్యోన్నతుల కోసం1.5 నిష్పత్తిలో సీనియారిటీ లిస్టులు ప్రకటించినప్పటికీ చాలామంది అభ్యర్థులు సుముఖంగా లేని కారణంగా ఖాళీలు భర్తీ కాలేదన్నారు. మొదటి లిస్టు కాకుండా రెండవ లిస్టులో ఉన్న ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచి ఉద్యోగోన్నతులు భర్తీ చేయాలని కోరారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవర్‌తో సంబంధం లేకుండా రిలీవ్ చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ పొజిషన్ ఐడి క్రియేట్ చేసి కనీసం ఈనెల 6లోగా సప్లమెంటరీ బిల్లు పెట్టుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతున్న దృష్ట్యా ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఐదుగురు ఉపాధ్యాయులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో వెబ్ ఆప్షన్ ఇచ్చినప్పటికీ బదిలీల్లో సదరు ఖాళీలు అలాట్ కాలేదన్నారు. బదిలీలు పూర్తయ్యే నాటికి కడప జిల్లాలో 700 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. డిఎస్‌సి ద్వారా కేవలం కడప జిల్లాలో 217 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న కారణంగా సుమారు 500 ఖాళీలు ఒక జిల్లాలోనే ఏర్పడే పరిస్థితి నెలకొనడంతో ప్రాథమిక విద్య కుంటుపడే పరిస్థితి ఉన్న దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలను సమీకరించి ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా వాటిని భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ప్లస్-2కు బోధిస్తున్న ఉపాధ్యాయులు బదిలీ అయిన దృష్ట్యా ప్రస్తుతం భర్తీ చేస్తున్న ప్లస్-2 ఖాళీల్లో గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇటీవల నాణ్యమైన సన్న బియ్యంతో తయారు చేసిన భోజనాన్ని అందిస్తున్న కారణంగా ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో బియ్యం పరిమాణాన్ని మరింత పెంచాలని కోరారు.

సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రతి నెలా 1న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, వితంతవులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 14వ వార్డు పరిధిలో స్థానిక టిడిపి నాయకులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకాగా నాగూర్‌లి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ దేశచరిత్రలో సరికొత్త అధ్యాయమన్నారు. అనంతరం నాగూర్ వలి మాట్లాడుతూ ఎపిని సిఎం చంద్రబాబు నాయుడు, మదనపల్లె నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పినకు పెద్దపీట వేస్తూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, స్థానికులు నస్రీన్ తాజ్, నవీన్ చౌదరి, గిరీష్ కుమార్, బాలమాలి శేఖర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్: పట్టణంలోని నూనె వారిపల్లిలో మంగళవారం నిర్వహించిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు పాల్గొని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రం ఎంతో అప్పుల్లో ఉన్నా ప్రతి నెలా ఒకటవ తారీఖున ఆశగా ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఉదయం 7 గంటల నుండి వారికి అందించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, రాజంపేట టిడిపి మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకటసుబ్బయ్య, యువ నాయకులు, జగదాబి పాండురాజు, పరుశు రాం నాయుడు, తేజల ఆనంద్, సుధీర్ రాజేష్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చంద్రకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి సింగిల్ విండో నూతన చైర్మన్‌గా ఎన్నికైన నల్లారి చంద్ర కుమార్‌రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పులి సత్యనారాయణరెడ్డి, లాయర్ రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కలికిరి రెడ్డివారిపల్లిలోని నల్లారి చంద్ర కుమార్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గతంలో ఎంపిపిగా చేసిన సేవలను కొనియాడారు. రైతు పక్షపాతి అయిన ఆయన చైర్మన్‌గా ఎంపికవడం రైతులకు న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, సభ్యులు మాన్యం రాజారెడ్డి, కొసెరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కంభంవారిపల్లి రాజారెడ్డి, ఇట్లంవారిపల్లి సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తాతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కందుకూరు పిహెచ్‌సి డాక్టర్ ఎ.శంకర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట


మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

వర్షాకాలం ప్రారం భమవుతున్న తరుణంలో ప్రజలు సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కందుకూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎ.శంకర్ సూచించారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లా డుతూ మాట్లాడుతూ వర్షాకా లంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలన్నారు. జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నాటు వైద్యం కాకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. పిహెచ్‌సికి ప్రతి రోజు సగటున 70 నుండి 80 మంది రోగులు వస్తున్నారని చెప్పారు. కందుకూరు, కమ్మచెరువు, మద్దయ్యగారిపల్లి, కట్టుగల్లు, పట్టివాండ్లపల్లి గ్రామాల నుంచి రోగులు వస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటివరకు డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. మందుల కొరత లేదని, సబ్ సెంటర్ల పరిధిలో అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కందుకూరు పిహెచ్‌సి పరిధిలో టి.సదుం, కమ్మచెరువు, మద్దయ్యగారిపల్లి, కందుకూరు అనే నాలుగు సబ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ఇక టిబిపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఎవరైనా దగ్గు లాంటి లక్షణాలు ఉంటే వెంటనే పిహెచ్‌సిలో పరీక్షలు చేయించుకోవాలని ప్రజలను సూచించారు.

25 రకాల పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

వ్యవసాయ రంగంలోని అధునాతన పద్ధతులతో 365 రోజులు 25 రకాల పంటలు సాగుతో భూమిని పచ్చగా కప్పేలా రైతులను సంసిద్ధం చేయాలని, అందుకు వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.శివనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేటలో మండల వ్యవసాయ అధికారి నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ, కంది పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. గ్రామాలలో భూమి లేని రైతులు కౌలుకు భూములు తీసుకొని సాగు చేస్తే రైతు సేవ కేంద్రాల్లో గుర్తింపు కార్డులను పొందవచ్చని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీతో కిసాన్‌డ్రోన్ అందజేస్తున్నాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న అధునాతన పద్ధతులను, కొత్త టెక్నాలజీలను ఉపయోగించుకొని వ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరామి, ఎంఎఒ వై.నాగమణి నీలకంఠరావుపేట గ్రామ సర్పంచ్ అయూబ్ ఖాన్, ఉప సర్పంచ్ మహమ్మద్ బాషా, రైతు సేవ కేంద్రం విఎఎ హరిత, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సమ్మిళితత్వం కోసం విస్తృత ప్రచారం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి:


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు ఆర్థిక సమ్మిళితత్వం కోసం విస్తృత ప్రచారం చేయాలని జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులను కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ వారి ఆధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక సమ్మిళితత్వంపై గోడపత్రికను కలెక్టర్ మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జరగబోయే ప్రచార కార్యక్రమాలను ప్రతి గ్రామ పంచాయితీలో ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమ యోజన ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకొని ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కలికిరి: సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహాన్ని ఎస్టీ కాలనీ వాసులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం కలికిరి పట్టణంలోని ఎస్టీ కాలనీ సమీపంలోని చెరువు వంకలో సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే యువతి మృతి చెందినట్లు నిర్ధారించుకుని స్థానికులను విచారించగా మృతిరాలు కలికిరి పట్టణం మదనపల్లి మార్గంలో గల జగనన్న కాలనీకి చెందిన ఎర్రయ్య, గంగులమ్మ కుమార్తె కందూరి చందన (23)గా గుర్తించారు. సమాచారం మృతురాలి తల్లిదండ్రులకు అందించగా వారి వివరాలు మేరకు ఆమెకు నరాలు బలహీనతతో ఇబ్బంది పడేదని, దాంతో మతిస్థిమితం లేక మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లినట్లు ఆయనకు తెలిపారు. తరువాత ఆమె పెట్రోల్ బంకులో పెట్రోల్ తీసుకుని వెళ్లి, ఎస్టీ కాలనీ స్మశాన వాటిక దగ్గర వంకలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు

ప్రజాశక్తి- రాయచోటి

స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు లయన్ పి.శ్యామ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడుతూ నిరంతరం విశేష సేవలు అందిస్తున్న వైద్యులను సన్మానించుకోవడం గర్వకారణమని తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్యులు బయారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.సి రాయి జన్మదినం, వర్ధంతి సందర్భంగా డాక్టర్స్‌డేను నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. రాజకీయంగా, వైద్య పరంగా ప్రజలకు ఎంతో సేవ చేశారని చెప్పారు. ఇలాంటి మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులు యోగా, ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విని గొప్ప స్థాయిలో ఉండాలన్నారు. తల్లిదండ్రులకు గొప్ప పేరు తేవాలని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.యస్.హరినాథ్ రెడ్డి, రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, సీనియర్ లయన్ సభ్యులు లయన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్యులను గౌరవించాలని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. అనంతరం వైద్యులు రమాదేవి, బయారెడ్డి, లయన్ నారాయణ రెడ్డి, లయన్ అరుణ్ కుమార్, లయన్ భరత్ కుమార్, మాధవిలత, ఉషారాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి లయన్ షేక్. ఇందాద్ అహ్మద్, లయన్ అంజిరెడ్డి, సాయి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పీలేరులో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పీలేరు పట్టణంలోని సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ చైర్మన్, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ మమతలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవ శరీరం పంచేంద్రియాలతో నిర్మితమైందని, అందులో ప్రధానంగా ప్రాణవాయువు ముఖ్యమని పేర్కొన్నారు. మానవ శరీరంలో రక్తం కూడా ప్రధానమని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఆహారంతో పాటు వ్యాయామం కూడా చాలా అవసరమని, సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి బృహత్ కార్యక్రమాన్ని తమ కళాశాలలో ఏర్పాటు చేయడం, తమ విద్యార్థులకు రక్తహీనత గురించి అవగాహన కల్పించి, హిమోగ్లోబిన్ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా డాక్టర్స్ డే సందర్భంగా కళాశాల యాజమాన్యం వైద్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, ఏరియా హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ మునాఫ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మదనపల్లె : అంగళ్లు సమీపంలోని మిట్స్ కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న ఆస్పత్రిలో సేవలందిస్తున్న డాక్టర్ చెన్నైయ్యను కళాశాల వేదికగా ఘనంగా సత్కరించారు. వైద్యుల సేవలకు కృతజ్ఞతగా ఈ సత్కార కార్యక్రమం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల అంకితభావం, నిస్వార్థ సేవకు కృతజ్ఞతగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. కోవిడ్-19 వంటి మహమ్మారిలో ప్రజారోగ్యాన్ని కాపాడటంలో వారు చేసిన త్యాగం చిరస్మరణీయమైందన్నారు. వైద్యుల కృషి, బాధ్యతా నిబద్ధత ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. వైద్యులు జీవితాంతం నేర్చుకునే విలువలు, వారి కరుణ, సేవా దృక్పథం అన్ని రంగాల్లోని నిపుణులకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమం వైద్యుల స్ఫూర్తిదాయకమైన సేవలకు గౌరవార్థంగా నిర్వహించబడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, ఇంటర్నేషనల్ సెల్ డీన్ శ్రీమంత్ బసు, పార్క్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ పీ. రమేష్ రెడ్డి, డాక్టర్ దామోదం పాల్గొన్నారు.


మదనపల్లె : డాక్టర్ చెన్నయ్యను సన్మానిస్తున్న మిట్స్ ప్రిన్సిపల్ యువరాజ్

టిబి బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



టిబి వ్యాధి గ్రస్తులకు పౌష్ఠికాహార కిట్లను ఇస్తున్న ఉదయ్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక అమ్మచెరువు మిట్టలో ఉన్న వెలుగు పాఠశాలలో టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. వెలుగు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 10 మంది టిబి రోగులను ఆరు నెలల పాటు దత్తత తీసుకుని వారికి పౌష్టికాహార కిట్లు అందజశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అన్నమయ్య జిల్లా ఆడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు, మదనపల్లి టిబి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ టిబి ముక్త భారత్ లక్ష్యంగా జిల్లాలో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. టిబి బాధితులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పర్కొన్నారు. వెలుగు సంస్థ 10 మందిని దత్తత తీసుకొని 6 నెలల పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ప్రశంసనీయం అన్నారు. వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డికి వైద్య ఆరోగ్య శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టిబి నివారణకు చర్యలు తీసుకుంటున్నాయని, అందులో భాగంగా నిక్షయ పోషణ యోజన కింద టిబి రోగులకు దాతల సహకారంతో ఆహారం అందించబడుతోందని తెలిపారు. టిబి బాధితుల్లో అత్యధికంగా పేదవారు, వయోవృద్ధులు, పసికూనలు, గర్భిణులు ఉన్నందున వారికి మందులతో పాటు పౌష్టికాహారం అవసరమని పేర్కొన్నారు. మదనపల్లి టిబి యూనిట్‌కి వెలుగు సంస్థ డాక్టర్లచే మైక్‌ను డొనేషన్‌గా అందించిందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు స్కూల్ ప్రిన్సిపల్ లీనాకుమారి, సోషియల్ వర్కర్ గీత, ఎఎన్ఎం గీతాంజలి, క్షయ నివారణ ఉద్యోగులు దయాలన్, ప్రభాకర్, శాంతి, వనజ కుమారి, సుశీల, తరుణ్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లి :ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ తంబళ్లపల్లె కెజిబి విద్యాలయంలో టిబి ముక్త్ భారత్ అభయాన్ వందరోజుల కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు. మరియు టిబి వ్యాధి లక్షణాలు, గళ్ళ పరీక్షలు, సక్రమంగా మందుల వాడకం, పౌష్టికాహారం తీసుకోవడం గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శ్రీమతి, ఉపాధ్యాయులు, టిబి సూపర్వైజర్ యం.రామకృష్ణ నాయుడు, ల్యాబ్ సూపర్ వైజర్ భూపతి, సిహెచ్ఒ కీర్తి, ఆశాలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నియంత్రణ సాధ్యం అవుతుందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలం లోని మంచూరులో నిర్వహిస్తున్న 104 సేవలలో పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, దోమ తెరలను వాడాలని, కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, భారతమ్మ, వాణి, వలిసాబ్, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఈనెల 5న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశాన్ని జడ్జి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ల వారిగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల సిఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

సంస్థ, సంఘం రెండు కళ్లు : ఎస్ఐసి

ప్రజాశక్తి - కడప అర్బన్

సంస్థలో బాధ్యతగా పనిచేస్తామని, సంఘం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని, ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలో కాపాడు కుంటామని, మరింత బలోపేతం చేసుకుంటామని ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం యూనియన్ 75 వ ఆవిర్భావ దినం సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ యూనియన్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం నేతలు 75 సంవత్సరాల యూనియన్ లోగో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ మోసకారి ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు వ్యతిరేకంగా తమ సంఘం 1951 నుంచి ఐదేళ్లపాటు పోరాడిందని, ఆ తర్వాతే జాతీయకరణ జరిగి ఎల్ఐసి సంస్థ ఏర్పాటు అయిందని గుర్తు చేశారు. అందుకే ఎల్ఐసి సంస్థ అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం మానస పుత్రిక అన్నారు. తాము సిబ్బందిగా సంస్థను, సంఘాన్ని రెండుకళ్లుగా భావిస్తామని అన్నారు. 75 ఏళ్లు నిండిన సీనియర్లను కడప డివిజన్ యూనియన్ సంస్థాపక నాయకులు ఖాదర్‌బాషా శంకర్రావు, చంద్రశేఖర్ రెడ్డి, ఎఆర్ఎస్ బాబు, గంగయ్యను గౌరవంగా సత్కరించారు.

వైవీయూ ఎల్ఎల్‌బి మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ లా కళాశాలల విద్యార్థులకు ఎల్ఎల్‌బి మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం వైవీయూలో ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. పలువురి విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల అడిషనల్ చీఫ్ సూపరింటిండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి మాట్లాడుతూ 684 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, 99 గైర్హాజరయ్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. ఈ పరీక్షలు ఈనెల 9 వరకు కొనసాగుతాయన్నారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్ డా.వి.రామకృష్ణ కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

చిత్తూరు జట్టుపై అనంతపురం విజయం

ప్రజాశక్తి - కడప

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 10 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 189 పరుగులు చేసింది. 5 వికెట్ల నష్టానికి 179 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 58.2 ఓవర్లలో 260 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెహాన్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 163 పరుగులు (సెంచరీ) చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 34.5 ఓవర్లలో 99 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 13.5 ఓవర్లు బౌల్ చేసి అందులో 5 ఓవర్లు మేడిన్ చేసి 32 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకోవడం విశేషం. సాయి ప్రతాప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. దీంతో చిత్తూరు జట్టు 29 పరుగుల విజయ లక్ష్యాన్ని అనంతపురం జట్టు ముందు ఉంచింది.


తలపడుతున్న చిత్తూరు, అనంతపురం జట్లు


మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

'తొలి అడుగు'ను విజయవంతం చేయండి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లరి కిషోర్ కుమార్‌రెడ్డి టిడిపి నాయకులకు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులకు సూచించారు. ప్రభుత్వం 2వ తారీకు నుండి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిరహిస్తున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ఇంటింటికి వెళ్లి కారపత్రాలు పంచి ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియచేయలని పేర్కొన్నారు. పట్టణంలోని అమర్నాథరెడ్డి కాలనీలో బుధవారం ప్రారంభమవుతుందని, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, అమలు చేయబోయే పథకాలను పాంప్లెట్ ద్వారా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మీకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

టిడిపిలో క్రమశిక్షణ కలిగిన నాయకుడు పఠాన్ ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, తాజ్ హోటల్ గ్రూప్స్ అధినేత పఠాన్ ఖాదర్ ఖాన్ పుట్టినరోజు వేడుకలు ఆయన నివాసం నిర్వహించారు. కూటమి నాయకులైన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, పులి మహాలక్ష్మి హాజరై కేక్ కట్ చేసి ఖాదర్ ఖాన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి, పఠాన్ ఖాదర్ ఖాన్ నిస్వార్థ సేవలు అందిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీలో వివిధ హెూదాలలో ఆయన పనిచేశారని, ఆయన సమర్థతను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించారన్నారు. టిడిపి అభ్యున్నతికి కృషిచేస్తున్న పఠాన్ ఖాదర్ ఖాన్ ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలు చేయాలని ఆకాంక్షించారు.


రాజీవ్ నగర్ కాలనీలో వేస్తున్న తాగునీటి బోరు

రాజీవ్‌నగర్ కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- కలకడ

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో బోరు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. మండల కేంద్రమైన కలకడ రాజీవ్ నగర్ కాలనీలో రాజు నీటి ఎద్దడి నివారణ కోసం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో నూతన బోరు ఏర్పాటు చేస్తున్నట్లు మండల యూనిట్ కన్వీనర్ వై.జిలానిబాషా పేర్కొన్నారు. ఈ కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన స్థానికులు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే స్పందించి తాగునీటి బోర్డు ఏర్పాటు చేసి కాలనీవాసులకు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం కాలనీలో తాగునీటి వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జాఫర్ హుస్సేన్, కరీముల్లా, ఖాజా హుస్సేన్, ఇర్షాద్ అలీ, మునాఫ్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సుగవాసి'ని కలిసిన బలిజ సంఘం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీకృష్ణ దేవరాయల బలిజ సంఘం నాయకులు పట్టణంలోని సుగవాసి బాల సుబ్ర హ్మణ్యం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి శాలువతో సన్మానించి, గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం వైసిపిలో పనిచేసే ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని, పార్టీని కష్టకాలంలో ఎవరైతే తోడుగా ఉంటారో వారికి ఎల్లప్పుడూ పార్టీ తోడుగా ఉంటుంది అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ టి.జి. మహేష్, వైస్‌చైర్మన్ రమణ, జాయింట్ సెక్రెటరీ కటారి గోపి, యూత్ ప్రెసిడెంట్ బాబు ప్రసాద్, మెంబర్ సురేష్, మాజీ కౌన్సిలర్ విజయ్, కుమరేశ్ పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

- లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రతి ఒక్కరూ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆర్థిక అక్షరాక్షత కార్యక్రమ నిర్వహణ సంస్థ విడ్స్ ఆధ్వర్యంలో జన సురక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు, స్థానిక ఎస్‌బిఐ మేనేజర్ హరిప్రసాద్ హాజరై ప్రసంగించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ జన సురక్ష పథకం గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరూ బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని మరియు పి ఎం ఎస్‌బివై, పీఎం జెజెబివై, ఎపి వై.వంటి అనేక విషయాల మీద జన సురక్ష ప్రోగ్రాంలో విద్యార్థులకు వివరించారు కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మొబైల్ ఫోన్లో వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. విడ్స్ సిఎఫ్ఎల్ కౌన్సిలర్ పవన్ కుమార్, ప్రభాకర్ మాట్లాడుతూ బడ్జెట్ ప్లానింగ్ గురించి, నామిని విషయాల గురించి డిజిటల్ లావాదేవీలు గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.